www.nagaranijam.com

PRGI/RNI NO: APTEL/2013/54450




# నగరనిజం

www.nagaranijam.com

అక్షరనిజం నగరనిజం

తెలుగు దిన పత్రిక

NNTV TELANGANA నగర నిజం

| సంపుటి : 13 | సంచిక :351 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 10 మంగళవారం, మార్చి 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 13 | Issue : 351 | Rangareddy | Editor : Yela.Purushotham | 10 Tuesday , MARCH 2026 | Pages : 4 + | Price : 3/- |

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

## విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన
# ప్రిన్సిపాల్ తొలగింపు


- చీఫ్ సూపరింటెండెంట్‌గా సీనియర్ ఉపాధ్యాయురాలు అంబిక




**మహేశ్వరం మార్చి 09, (నగరనిజం) :** మహేశ్వరం మండల కేంద్రం లోని ఇంటర్ పరీక్ష కేంద్రం మోడల్ స్కూల్ నందు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల చీఫ్ సూపరింటెండెంటుగా విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ ఇ.గోపి ఈనెల ఆరో తేదీన ఉదయం 8 గంటలకు పోలీసు స్టేషన్‌కు పశ్నపత్రాలు తీసుకోవడానికి డిపార్ట్మెంటల్ ఆఫీసర్ తో పాటు రావాల్సి ఉండగా, అతను రాకపోవడంతో డిపార్ట్మెంటల్ ఆఫీసరు ఒక్కరే పోలీస్ ఎస్కార్ట్ సహాయంతో ప్రశ్నపత్రాలు తీసుకొని పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్ష నిర్వహించాడు. చీఫ్ సూపరింటెండెంట్ ఇ.గోపి కేవలం కస్టోడీయన్ నర్సయ్యకి మాత్రమే సమాచారం ఇచ్చి పరీక్ష కేంద్రానికి 10 గంటల తర్వాత చేరుకున్నారు. అత్యవసర సమయంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే ఆ విషయాన్ని జిల్లా పరీక్షల కమిటీ సభ్యులకు మరియు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారీ ఎంక్యా నాయక్ దృష్టికి తీసుకపోవాలి. ఈ విషయాన్ని చీఫ్ సూపరింటెండెంట్ ఇ.గోపి,జిల్లా అధికారుల దృష్టికి తీసుకోలేదని ప్రాథమిక విచారణలో తేలింది. ఇట్టి విషయం పత్రికల ద్వారా తెలుసుకున్న ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు మరియు రంగారెడ్డి జిల్లా కలెక్టరు అతనిని పరీక్షల విధుల్లోంచి తొలగించి షోకాజ్ నోటీసులు జారీ చేయమని డిఐఈవో కి ఆదేశాలు జారీ చేశారు. ఇ.గోపి స్థానంలో సీనియర్ ఉపాధ్యాయురాలు అంబిక చీఫ్ సూపరింటెండెంటుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు మరియు జిల్లా కలెక్టరు ఆదేశాలానుసారం నోటీసుకి వివరణ అందిన తర్వాత విచారణ చేసి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఎంక్యా నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. నామ మాత్రంగా విధుల్లోంచి తప్పించకుండా... పిల్లల భవిత్యత్తుకు సంబంధించిన పరీక్షల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వ్యక్తులపై సమగ్ర విచారణ చేసి కఠినచర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆర్టీఐ కార్యకర్తలకు తలుపులు
# మూసిన మున్సిపాలిటీ?

- సమాచార హక్కు చట్టంపై నిర్లక్ష్యం వహిస్తున్న ఎల్లంపేట్ మున్సిపల్ పౌర సమాచార అధికారి




**మేడ్చల్ మార్చి 9 (నగర నిజం)** ఎల్లంపేట్ మున్సిపల్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అమలు విషయంలో నిర్లక్ష్యం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమాచారం కోరుతూ దాఖలు చేసిన ఆర్టీఐ దరఖాస్తులకు సమయానికి సమాధానం ఇవ్వకుండా పౌర సమాచార అధికారి వ్యవహరిస్తున్నారని ఆర్టీఐ కార్యకర్తలు విమర్శిస్తున్నారు.ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రజా సమస్యలకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి కార్యకర్తలు దాఖలు చేసిన ఆర్టీఐ దరఖాస్తులకు నెలలు గడుస్తున్న సమాచారం అందడం లేదని వారు తెలిపారు.రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ , 2005 ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలకు సమర్పించిన ఆర్టీఐ దరఖాస్తులకు 30 రోజులలోపు సమాచారం అందించడం పౌర సమాచార అధికారుల చట్టబద్ధమైన బాధ్యత. అయినప్పటికీ కొన్ని సందర్భాల్లో అధికారులు సమాచారం ఇవ్వకుండా ఆలస్యం చేయడం లేదా స్పందించకపోవడం వల్ల ప్రజల్లో అసంతృప్తి నెలకొంది.ఆర్టీఐ కార్యకర్తల అభిప్రాయం ప్రకారం, సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకతను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. చట్టం ప్రకారం సమాచారం ఇవ్వకపోతే సంబంధిత అధికారులపై జరిమానా విధించే నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, ఆర్టీఐ దరఖాస్తులకు సమయానికి సమాధానం ఇవ్వాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే ఈ అంశాన్ని ఉన్నతాధికారుల, సమాచార కమిషన్ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉందని కూడా వారు హెచ్చరిస్తున్నారు.ప్రజాస్వామ్యంలో పారదర్శకతను కాపాడే ప్రధాన చట్టమైన ఆర్టీఐను అధికారులు గౌరవిస్తూ ప్రజలకు సమాచారం అందించాల్సిన అవసరం ఉందని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు.

# పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిపుష్టికి చర్యలు

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- హాస్పిటల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పారిశుద్ధ్యం పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలి
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలలో భాగంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలలో పారిశుద్ధ్యం పనులు నిర్వహించాలి



**ఖమ్మం, (నగర నిజం బ్యూరో)మార్చి-9** పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిపుష్టికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఆసుపత్రి లో పారిశుద్ధ్యం పనులు పక్కగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖమ్మం నగరం శ్రీనివాస నగర్ లోని పట్టణ ప్రాథమిక ఆర్యోగ కేంద్రం ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్ పరిసరాలలో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, చెత్త పేరుకుపోకుండా ప్రతి రోజూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు వైద్యం కు ఉపయోగించిన వ్యర్థాలు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో తిరుగుతూ ఓపి సేవలు, ఐపీ సేవలు, డ్రగ్ స్టోర్ రూంలో మందుల నిల్వలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా నిరంతరం అందుబాటులో ఉండేలాగా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి నేరుగా పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఏ ప్రాంతం నుండి వచ్చినది, వచ్చి ఎంత సమయం అయింది, సమస్య ఏమిటి అని అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎన్ని ఓ.పి. లను చూస్తున్నది, గర్భిణిలకు ప్రత్యేక సేవలు, సాధారణ కాన్పులకు ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఐపి ఎంత మంది, ఏ ఏ వ్యాధులకు ఎక్కువగా వస్తున్నది అడిగారు. ఎంసిహెచ్, ఎన్సీడి, ఇడిడి రిజిస్టర్ లను పరిశీలించారు. వైద్య పరిక్షల సాంపిల్స్ కలెక్షన్స్ గురించి, ఎంత మందికి పరీక్షలు చేసింది అడిగి తెలుసుకున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో నమోదైన గర్భిణులను సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకొనేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం ఆవరణంలో పేషంట్ల గదులు శుభ్రంగా ఉండేలా చూడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ దవాఖానకు వచ్చే ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర మందులు సరిపోను స్టాక్ ఉండాలని, అవసరమైన మందులకు వెంట వెంటనే ఇండెంట్ పెట్టాలని అన్నారు. మందుల లభ్యత, ఎక్కువగా అవసరమయ్యే మందులు నిల్వ ఉండేలా చూడాలన్నారు. రోగులు మందులు బయట కొనుక్కునే పరిస్థితి రావద్దన్నారు. ఏఎన్ఎం, ఆశాలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొరత లేకుండా చూడాలన్నారు. కావాల్సిన ఏఎన్ఎం, ఆశాల గురించి, వైద్య సేవలు అందుబాటులో లేని ప్రాంతాలను గుర్తించి, అక్కడ క్రొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది, మందులు, వనరుల కల్పన కు చర్యలు తీసుకోవాలని, పట్టణ ఆరోగ్య కేంద్రాలు సమర్ధవంతంగా పనిచేస్తే, ప్రజలకు దగ్గర్లో వైద్య సేవలు అందడంతో పాటు, జిల్లా కేంద్ర ఆసుపత్రికి రోగుల తాకిడి తగ్గుతుందని అన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా డి.ఎం.హెచ్.వో. డా. రామారావు, డిప్యూటీ డి.ఎం.హెచ్.వో. డా. వేణు మాధవ్, వైద్యాధికారులు డా. సమీరా, డా. సురేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.జిల్లా పౌరసంబంధాల అధికారి, ఖమ్మం కార్యాలయంచే జారీ చేయనైనది.

## ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యల స్వీకరణ



**జగిత్యాల్ మార్చి 09 (నగర నిజం)** ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఈరోజు 56 ఫిర్యాదులు , వినతులు స్వీకరించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రజల సమస్యలను అధికారులు సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు . ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ప్రజావాణి కార్యక్రమం వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు.

## 99 రోజుల పట్టణ ప్రణాళికలో పారిశుద్ధ కార్మికులకు రక్షణ ఎక్కడ?

- ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో భద్రతా పరికరాల లేమి

అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆవేదన



**మేడ్చల్ మార్చి 9 (నగర నిజం)**ప్రభుత్వం అమలు చేస్తున్న పట్టణ పరిశుభ్రత కార్యక్రమాల్లో పారిశుద్ధ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ఎల్లంపేట్ మున్సిపల్ పరిధిలో వారి భద్రతపై సరైన శ్రద్ధ లేకపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి.ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలో అమలు చేస్తున్న 99 రోజుల పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుభ్రత పనులు జరుగుతున్నప్పటికీ, పనులు చేస్తున్న పారిశుద్ధ కార్మికులకు తగిన రక్షణ పరికరాలు అందడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.పారిశుద్ధ కార్మికులు చెత్త తొలగింపు, డ్రైనేజీ శుభ్రపరిచే పనులు వంటి ప్రమాదకరమైన పనులు చేస్తున్నప్పటికీ వారికి గ్లోవ్స్, మాస్కులు, బూట్లు వంటి భద్రతా పరికరాలు అందించకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ పరిస్థితికి కారణం సంబంధిత అధికారుల నిర్లక్ష్యమేనని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా ఇంచార్జ్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ రమణారెడ్డి,మున్సిపల్ మేనేజర్ అబ్దుల్ సలాం ఈ విషయంపై తగిన దృష్టి పెట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపిస్తున్నారు.పారిశుద్ధ కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నందున వారి భద్రతపై మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు,సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. కార్మికుల ఆరోగ్యం,భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం అత్యవసరమని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇట్టి విషయంపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజల సమస్యలపై పోరాటం చేయడానికి బిజెపి పార్టీలో జాయిన్ అయ్యాము

- మాజీ కార్పొరేటర్ మేకల విజయలక్ష్మి రవీందర్ రెడ్డి



**మీర్పేట్ మార్చి 9 (నగర నిజం)** మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్ బడంగ్పేట్ సర్కిల్లోని 57వ డివిజన్ పరిధిలోని జిల్లెలగూడ మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ మేకల విజయలక్ష్మి రవీందర్ రెడ్డి ఆదివారం బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సమక్షంలో బిజెపి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు. అనంతరం మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి రవీందర్ రెడ్డి జిల్లెల్లగూడలోని వారి నివాసంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు.వారు మాట్లాడుతూ నేను గత 30 సంవత్సరాలుగా రాజకీయంలో ఉన్నాను వార్డ్ మెంబర్ నుండి కార్పొరేట్ వరకు ప్రజల ఓట్లతో ఎన్నికై అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగింది అని తెలిపారు. మీర్పేట మున్సిపాలిటీ ఉన్నప్పుడు ఇంటి పన్ను అధికంగా ఉన్నది ఈ మున్సిపాలిటీని జిహెచ్ఎంసి లో కలిపిన బడంగ్పేట్ కంటే హైదరాబాద్ కంటే ఎక్కువగా ఇంటి పన్ను కట్టడం వలన ప్రజలపై ఎంతో భారం పడుతుందని ఆయన ఆవేదన చెందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నుండి నేను బిఆర్ఎస్ పార్టీలో పని చేశాను తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వంలో ఉన్నా కూడా ఇంటి టాక్స్ లపై పోరాటం చేశాము తర్వాత సబితా ఇంద్రారెడ్డి కూడా బిఆర్ఎస్ పార్టీలో జాయిన్ అయ్యి మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నోసార్లు సబితా ఇంద్ర రెడ్డికి మీర్పేట ఇంటి టాక్సులు తగ్గించాలని కోరాము. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంటి టాక్స్ లు తగ్గించలేదు తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలు అయినా ఇంటి టాక్స్ లు తగ్గకపోవడంతో నిరాశ చెంది బిజెపి పార్టీలో చేరి ఇంటి టాక్స్ లపై పోరాటం చేయాలని నిర్ణయించుకొని బిజెపి పార్టీలో జాయిన్ అయినామని వారు తెలిపారు. ఇంటి పన్నులు ఎక్కువగా ఉండడం అలాగేపారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు ఆగిపోయాయి వీటిపై బీజేపీ పార్టీలో ఉంటే పోరాటం చేయవచ్చని వారు అన్నారు. మీర్పేట్ మున్సిపాలిటీ బిజెపి క్లస్టర్ 2 అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్ మాట్లాడుతూ మాజీ కార్పొరేటర్ సీనియర్ నాయకులు మేకల విజయలక్ష్మి రవీందర్ రెడ్డి మా బిజెపి పార్టీలో చేరడం వలన మాకు కొంత బలం పెరిగిందని అలాగే వారి సూచనలు సలహాలు తీసుకొని ముందుకెళ్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సిద్దాల శ్రీనివాస్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## గిగ్గిల్ కిడ్స్ ప్లే స్కూల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు



**ఎల్బీనగర్, మార్చి 9 (నగర నిజం):** కర్మాన్‌ఘాట్ టీకేఆర్ కాలేజ్ సమీపంలో 'గిగ్గిల్ కిడ్స్ ప్లే స్కూల్‌లో ' అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళ ఉపాధ్యాయులు, విద్యార్థినిలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా "ప్రిన్సిపల్ కె. నవ్య శ్రీ" మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళలు విద్య, ఉద్యోగాలు, వ్యాపారం వంటి అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ దేశ ప్రగతికి తమ వంతు సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల సాధికారత కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఫౌండర్ ఎన్. స్వప్న, ఎస్. నవ్యశ్రీ తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నగరనిజం కథనానికి ఓపెన్ డ్రైనేజీ శుభ్రం







**మహేశ్వరం మార్చి 09, (నగరనిజం) :** నగరనిజం కథనానికి స్పందన లభించింది "ఓపెన్ డ్రైనేజీ తో దోమల బెడద" అనే కథనానికి మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ డ్రైనేజీ వ్యవస్థను పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దీంతో గ్రామస్తులు తోపాటు వార్డు సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో సమస్యలు ఏమున్నా తన దృష్టికి తీసుకొస్తే సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మురికి కాలువను శుభ్రం చేసేల చొరవ చూపిన నగరనిజం దినపత్రికకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## వార్డ్ సభ్యులకు ఐదు రోజుల శిక్షణ ప్రారంభం




**వలిగొండ మార్చి 9.( నగర నిజం):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వార్డ్ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన తొలి బ్యాచ్ శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ శిక్షణా కార్యక్రమం ఐదు రోజుల పాటు కొనసాగి మార్చి 13 వరకు నిర్వహించబడనుంది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారి జగన్నాథరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలందర్ రెడ్డి, మండల పంచాయత్ అధికారి వై. ప్రేమలత హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో వార్డ్ సభ్యుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ఈ శిక్షణలో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, పంచాయతీ పరిపాలన విధానాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై వార్డ్ సభ్యులకు అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కె. రాధాకుమార్, జూనియర్ అసిస్టెంట్ ఎం.డి. సమియుద్దీన్ పాల్గొన్నారు. శిక్షకులుగా వి. సైదిరెడ్డి, మహమ్మద్ అబ్దుల్ ఖదీర్, షేక్ హుస్సేన్, వి. నరేందర్ శిక్షణ అందిస్తున్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ సభ్యులు మరియు ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జూబ్లీహిల్స్‌లో వాసవి గోల్డ్ అండ్ డైమండ్స్ గ్రాండ్ ఓపెనింగ్

**హైదరాబాద్, 9 (నగర నిజం ప్రతినిధి):** నగరంలోని ప్రముఖ ఆభరణాల సంస్థ వాసవి గోల్డ్ అండ్ డైమండ్స్ తన కొత్త ఆధునిక షోరూమ్‌ను జూబ్లీహిల్స్ ప్రాంతంలో మార్చ్ 9న ఘనంగా ప్రారంభించింది. అత్యాధునిక సదుపాయాలతో, వినూత్న డిజైన్లతో రూపొందించిన ఈ షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి వ్యాపారవేత్తలు, ఆభరణాల రంగానికి చెందిన ప్రముఖులు, స్థానిక ప్రజలు మరియు కస్టమర్లు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ రాజు మడిపడిగే మాట్లాడుతూ, వినియోగదారుల విశ్వాసమే తమ సంస్థకు బలమని పేర్కొన్నారు. కస్టమర్లకు నాణ్యమైన బంగారం, వెండి మరియు డైమండ్ ఆభరణాలను అందుబాటు ధరల్లో అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆధునిక కాలానికి అనుగుణంగా సరికొత్త డిజైన్లతో రూపొందించిన ఆభరణాలను అందుబాటులో ఉంచామని, పెళ్లిళ్లు, వేడుకలు మరియు ప్రత్యేక సందర్భాలకు అనువైన విభిన్న కలెక్షన్‌ను షోరూమ్‌లో ప్రదర్శనకు ఉంచినట్లు చెప్పారు. గ్రాండ్ ఓపెనింగ్ సందర్భంగా వినియోగదారుల కోసం పలు ప్రత్యేక ఆఫర్లను కూడా సంస్థ ప్రకటించింది. ₹1.5 లక్షల విలువైన గోల్డ్, డైమండ్ లేదా సిల్వర్ జువెలరీ కొనుగోలు చేసిన ప్రతి కస్టమర్‌కు ఒక గోల్డ్ కాయిన్ మరియు ఒక సిల్వర్ కాయిన్ ఉచితంగా అందజేస్తామని సంస్థ వెల్లడించింది. అదనంగా కొనుగోలు చేసిన ప్రతి కస్టమర్‌కు ₹5,000 విలువైన ఫ్రీ లక్కీ డ్రా కూపన్లు కూడా అందజేస్తామని తెలిపారు. ఈ లక్కీ డ్రా ద్వారా






అదృష్టవంతులైన కస్టమర్లకు మరిన్ని ఆకర్షణీయమైన బహుమతులు అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇంకా ప్రత్యేకంగా ₹46,999 విలువైన డైమండ్ జువెలరీపై ప్రత్యేక ఆఫర్ ను కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. డైమండ్ ఆభరణాలను కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశమని చెప్పారు. ఈ ప్రత్యేక ఆఫర్లు పరిమిత కాలానికి మాత్రమే అందుబాటులో ఉంటాయని, కస్టమర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ నిర్వాహకులు సూచించారు. ఈ సందర్భంగా వినియోగదారుల కోసం "స్వర్ణ సూత్రం" గోల్డ్ సేవింగ్ స్కీమ్ ను కూడా ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. ఈ స్కీమ్ ద్వారా సభ్యులు నెలనెలా పొదుపు చేస్తూ చివరలో బంగారు ఆభరణాలను సులభంగా కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ స్కీమ్‌లో సభ్యులకు ప్రత్యేక రాయితీలు, లక్కీ డ్రా అవకాశాలు మరియు ఇతర ప్రయోజనాలు కూడా అందుబాటులో ఉంటాయని వివరించారుఅలాగే కస్టమర్లకు మరింత సౌకర్యంగా షాపింగ్ అనుభవాన్ని కల్పించేందుకు షోరూమ్‌లో విస్తృతమైన డిస్ప్లే గ్యాలరీ, అనుభవజ్ఞులైన సిబ్బంది సేవలు, అత్యాధునిక భద్రతా ఏర్పాట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సంప్రదాయ మరియు ఆధునిక డిజైన్లలో విభిన్న రకాల గోల్డ్, సిల్వర్ మరియు డైమండ్ ఆభరణాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌తో పాటు మణికొండ, వనస్థలిపురం, బోడుప్పల్ ప్రాంతాల్లో కూడా వాసవి గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కొత్త షోరూమ్ ద్వారా మరింత మంది వినియోగదారులకు ఉత్తమ సేవలను అందించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. వినియోగదారులు పెద్ద సంఖ్యలో షోరూమ్‌ను సందర్శించి కొత్త కలెక్షన్‌ను వీక్షించడంతో పాటు ప్రారంభోత్సవ ఆఫర్లపై ఆసక్తి చూపుతున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

# ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు .**



**ప్రజావాణికి 41 పిర్యాదులు.**

**నగర నిజం మార్చి 09 సంగారెడ్డి, మార్చి 9 :** ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులే హాజరుకావాలని, సమయపాలన పాటించాలని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (ఇన్‌చార్జ్) పాండు అన్నారు. జిల్లాఅధికారులు హాజరుకాకుండా, వారి సహాయకులు హాజరవుతున్న విషయం గమనించామని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేసారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని గ్రివేన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 41 పిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దూర ప్రాంతాల నుంచి ప్రజావాణికి వస్తారని, వారి సమస్యలను అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడమే కాకుండా, తగిన పరిష్కార మార్గాలను కూడా చూపించాలని సూచించారు. ప్రజా సమస్యల పై ఆయా శాఖల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) మాధురి , నారాయణ్ ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి , జడ్పీసీఈఓ జానకిరెడ్డి , ఆర్డీఓలు ,వివిధ శాఖల జిల్లా అధికారులు ,ప్రజలు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై కలెక్టర్ కు వినతి పత్రం



**జగిత్యాల్ మార్చి 09 (నగర నిజం)** ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా మధ్యాహ్నం భోజనం కార్మికులకు బిల్లును చెల్లించాలని కోరారు. ప్రతి విద్యార్థికి మెస్ ఛార్జీ రూ.25 చొప్పున చెల్లించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెన్న మహేష్, సరస్వతి, సావిత్రి, శారద ,పద్మ , పలువురు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా పారిశుధ్య కార్మికులు, మహిళా పోలీసులకు సత్కారం

- **బిజెపి నాయకురాలు లయ కాలంశెట్టి**



**ఎల్బీనగర్, మార్చి 9 (నగర నిజం):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజానికి అంకితభావంతో సేవలందిస్తున్న జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు మరియు నాగోల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా పోలీసులను "బిజెపి నాయకురాలు లయ కాలంశెట్టి" ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వారి సేవలను గుర్తిస్తూ శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లయ కాలంశెట్టి మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. నగర పరిశుభ్రత కోసం కష్టపడుతున్న పారిశుధ్య కార్మికులు, ప్రజల భద్రత కోసం విధులు నిర్వర్తిస్తున్న మహిళా పోలీసులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్. నీరజ, యామిని, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- **జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**



**నగరనిజం సంగారెడ్డి, మార్చి 9:**-ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు పారిశుధ్యం, విద్యార్థులకు అందే సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు .ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇస్నాపూర్‌లోని జెడ్పీ హైస్కూల్ మరియు డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, పారిశుధ్యం, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందన్నారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై మరింత దృష్టి సారించాలని సూచించారు. హాల్ టికెట్లు అందాయా, అందులో వివరాలు సరిగ్గా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు రివిజన్ చేస్తున్నారా అని ప్రశ్నిస్తూ ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన షెడ్యూల్ సరిగా అమలు కావడం లేదని గుర్తించిన కలెక్టర్, సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు గుడ్లు అందించడం లేదని గమనించి, వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల హెడ్‌మాస్టర్ అనుమతి లేకుండా గైర్హాజరు కావడంపై ఆగ్రహించిన కలెక్టర్ హెచ్ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, అదేవిధంగా కొంతమంది ఉపాధ్యాయులు గైర్హాజరు కావడం పై ఎంఈఓ వివరణ ఇవ్వాలని, పర్యవేక్షణ లోపించినందుకు ఎంఈఓకు కూడా షోకాజ్ నోటీసు ఇవ్వాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని కలెక్టర్ స్పష్టం చేసారు. శానిటేషన్ గ్రాంట్ కింద ఎంత మందిని ఎంగేజ్ చేసుకుంటున్నారో, వారి పేర్లు, ఎప్పటి వరకు పేమెంట్ చేశారన్న వివరాలను అందించాలని సూచించారు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడం , డైనింగ్ హాల్ సరిగా శుభ్రం చేయకపోవడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డును పరిశీలించిన కలెక్టర్, అక్కడ మంటలు చెలరేగిన ప్రాంతాన్ని 24 గంటల్లో వాటర్ ట్యాంకర్ల సహాయంతో పూర్తిగా ఆర్పివేయాలని ఆదేశించారు. సెగ్రిగేషన్ ప్రాంతంలో ఉన్న లెగసీ వ్యర్థాలను 48 గంటల్లో పూర్తిగా తరలించి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయాలని సూచించారు. డంపింగ్ యార్డ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమంగా చెత్త వేయకుండా 24 గంటల పర్యవేక్షణ ఉండేలా ఒక కార్మికుడిని నియమించాలని ఆదేశించారు. అలాగే వ్యర్థాలను సేకరించే మున్సిపల్ ఆటోలు, ప్రైవేట్ వాహనాల ద్వారా చెత్తను ఎక్కడ ప్రాసెస్ చేస్తున్నారు, ఎక్కడికి తరలిస్తున్నారు అనే అంశంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలపై వెంటనే చర్యలు తీసుకొని యాక్షన్ టేకన్ రిపోర్ట్ ను సమర్పించాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. ఈ సందర్శనలో కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్ పర్సన్ సుమలత, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సేవా ప్రయాణంలో మరో మకుటం యలమంచి ఉదయ్ కిరణ్‌కు "సేవా రత్న" పురస్కారం

**కుత్బుల్లాపూర్, 9 (నగర నిజం ప్రతినిధి):** ప్రముఖ సామాజిక కార్యకర్త, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపకుడు మరియు చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ కు ప్రతిష్టాత్మకమైన "సేవా రత్న" పురస్కారం ప్రదానం చేయబడింది. గచ్చిబౌలిలోని ఎస్ఆర్ కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించిన "కమ్మ ఐకాన్ లెజెండరీ అవార్డ్స్" కార్యక్రమం లో ఈ పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏ.ఎస్.వి. రామారావు చౌదరి, కమ్మ సంక్షేమ అభివృద్ధి సంస్థ డైరెక్టర్, రాజకీయ విశ్లేషకులు బండారు మనోహర్ నాయుడు, అప్పసాని రాజేష్, ముప్పా అంకమ్మ రావు చౌదరి, కాకర్ల రంగనాథ్ తదితర ప్రముఖులు హాజరై యలమంచి ఉదయ్ కిరణ్ కు "సేవా రత్న" పురస్కారాన్ని ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. సమాజ సాధికారత, ప్రజాసేవ మరియు నాయకత్వ రంగాల్లో ఆయన చూపుతున్న విశిష్ట సేవా దృక్పథం, నిబద్ధతకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో యలమంచి ఉదయ్ కిరణ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను నిర్వాహకులు విశేషంగా ప్రశంసించారు. సేవా పథంలో పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు సామాజిక సేవలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యలమంచి ఉదయ్ కిరణ్ గతంలో కూడా పలు జాతీయ స్థాయి పురస్కారాలను అందుకున్నారు. వాటిలో ముఖ్యమైనవి:గౌరవ డాక్టరేట్ పట్టా సామాజిక సేవలో విశిష్ట కృషికి గానుసేవా రత్న జాతీయ పురస్కారం



జి.హెచ్.పి.యు సంస్థ నుండిఅబ్దుల్ కలాం జాతీయ సేవా రత్న పురస్కారం విశ్వ ఆర్ట్స్ మరియు మన కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభా పురస్కారం ప్రెస్ వింగ్స్ క్లబ్ ద్వారాట్రస్ట్ నిర్వహిస్తున్న ముఖ్య సామాజిక సేవా కార్యక్రమాలుయలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమాజ హితాన్ని లక్ష్యంగా పెట్టుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మియాపూర్ డివిజన్ వ్యాప్తంగా వేసవి కాలంలో ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు సమ్మర్ కూలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు మరియు జ్యామెట్రీ బాక్సుల పంపిణీ, వృద్ధాశ్రమాల్లో నివసించే వృద్ధులకు పండ్ల పంపిణీ, ఉచిత వైద్య సలహాలు మరియు పరీక్షలతో మెగా వైద్య శిబిరాలు, అనాథాశ్రమాల్లో పిల్లలకు పోషకాహార భోజనాల పంపిణీ, దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక అవసరాల సామగ్రి పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా యువతను ప్రోత్సహించేందుకు బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు బహుమతులు, సమాజంలో క్రీడలను ప్రోత్సహించేందుకు వాలీబాల్ కిట్లు మరియు క్యారమ్ బోర్డుల పంపిణీ, అవసరమైన వారికి ఉచిత మందుల పంపిణీ, ఆర్థికంగా బలహీన వర్గాలకు బెడ్ షీట్ల పంపిణీ, ఉచిత కంటి పరీక్ష శిబిరాలు, పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులకు పాఠశాల ఫీజుల చెల్లింపు, మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రతిభావంతులైన మహిళలకు సన్మానాలు, అనాథాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు, అలాగే నగర సేవలో ఉన్న 300 మందికి పైగా జీహెచ్ఎంసీ కార్మికులకు భోజన పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయ్ కిరణ్ స్పందనఈ సందర్భంగా స్పందించిన యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ,"ఈ గుర్తింపు నాకు ఎంతో గౌరవంగా ఉంది. యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మేము చేపడుతున్న ప్రతి సేవా కార్యక్రమం వెనుక మా వాలంటీర్లు మరియు మద్దతుదారుల సమిష్టి కృషి ఉంది. ఈ పురస్కారం మాకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుంది. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి పేదలు మరియు అణగారిన వర్గాలకు అండగా నిలవడం నా ప్రధాన లక్ష్యం" అని తెలిపారు. సమాజ హితం కోసం నిరంతరం సేవలందిస్తున్న యలమంచి ఉదయ్ కిరణ్ కు పలువురు ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు మరియు అభిమానులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు నవ్యశ్రీ, లావణ్య, రాధాకృష్ణ, రమేష్, వంశీ, ప్రవీణ్, రాజేష్ చౌదరి, నాగసాయి, సాయి నిఖిల్, రాజేష్, సతీష్, వినోద్, నాని, వినయ్, శివ పాల్గొన్నారు.

## మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు





**వలిగొండ, మార్చి 09:( నగర నిజం)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం, వెంకటాపురం గ్రామంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే శుక్రవారం (మార్చి 13, 2026) ఉదయం 10:00 గంటలకు కొండపై ఉన్న ఆలయ ప్రాంగణంలో ఈ లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారి, రెవెన్యూ అధికారులు, పోలీసు యంత్రాంగం మరియు గ్రామ పెద్దల సమక్షంలో పారదర్శకంగా హుండీలను విప్పి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి (జూ) ఎస్. మోహన్ బాబు గారు వివరాలను వెల్లడిస్తూ, ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ




**కొల్లాపూర్ మార్చి 9 ( నగరనిజం ప్రతినిధి ఎర్రం నాగేంద్రం)** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజాపూర్ నందు సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా 40 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వివిధ బాధ్యతలను నిర్వర్తించారు కలెక్టర్గా డీ దీపిక, డిఇఓగా కే సంధ్య, ఎంఈఓ గా అర్జున్, ప్రధానోపాధ్యాయులుగా చరణ్ బాధ్యతలు నిర్వహించారు . పాఠ్యాంశాల బోధనలో చక్కటి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాధికారి భాస్కర శర్మ గారు మాట్లాడుతూ లక్ష్యంతో నిర్దేశించిన పనులను సక్రమంగా నిర్వహించాలని, మన ముందున్న పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆంజనేయులు గట్టయ్య, ఎం మల్లికార్జున్, ఎస్ మల్లికార్జున్ ,ప్రభాకర్, శ్రీశైలం, శ్రీలత, మహేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమం



**నగర నిజం మార్చి 09 సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు** ఏపీజే అబ్దుల్ కలాం పేరుతో ఉన్న పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. కళాశా లకు సంబంధించిన దస్త్రాల నిర్వహణ, కార్యాలయాల పరిశుభ్రతతో పాటు త్రాగునీటి ట్యాంకులను శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టినట్లు కళాశాల ప్రధానాచార్యులు ఎం. ప్రవీణ తెలిపారు. కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది అధికారి అజయ్ ఆధ్వర్యంలో అరుణ్ కుమార్, సంగమేశ్వర్, రాజమణి, పోచమ్మ, మల్లప్ప, చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే జాతీయ సేవా పథకం సేవాదారులు కూడా పాల్గొని కళాశాల పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక







- రాష్ట్ర కాంగ్రెస్ నేత జెల్లపల్లి నరేందర్
- శంషాబాద్ లో మాజీ కౌన్సిలర్ మహమ్మద్ జహంగీర్ ఖాన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు
- ఇఫ్తార్ విందుకు హాజరైన కాంగ్రెస్ నేతలు నరేందర్, సంజయ్ యాదవ్

**రాజేంద్రనగర్, మార్చి 9 (నగరనిజం ప్రతినిధి):** రంజాన్ పవిత్ర మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక వంటివని రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జెల్లపల్లి నరేందర్ అభిప్రాయపడ్డారు. కుల మతాలకు అతీతంగా తెలంగాణలో ప్రజలంతా కలిసిమెలిసి జీవించాలని ఆయన పిలుపునిచ్చారు. రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ కు చెందిన మాజీ కౌన్సిలర్ మహమ్మద్ జహంగీర్ ఖాన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జెల్లపల్లి నరేందర్ తో పాటు శంషాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ మేరకు ముస్లిం సోదరులకు ఫ్రూట్స్ తినిపించి రంజాన్ ఉపవాస దీక్షలు విరమింప చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నరేందర్.... ముస్లిం సోదరులందరికీ రంజాన్ పవిత్ర మాస శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో గంగా జమునా తహజీబ్ మాదిరిగా హిందువులు, ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటారని చెప్పారు. దశాబ్దాల కాలంగా తెలంగాణలో కుల మతాలకు అతీతంగా ప్రజలు కలిసిమెలిసి జీవించడం అభినందనీయమన్నారు. ముస్లిం సోదరులు పవిత్ర మాసం గా భావించే రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందు కార్యక్రమంలో తాము పాల్గొనడం ఆనందంగా ఉందని నరేందర్ ప్రకటించారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా శంషాబాద్ ప్రాంతానికి చెందిన ముస్లిం సోదరులందరికీ నరేందర్ రంజాన్ పవిత్ర మాస శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మాజీ కౌన్సిలర్లు సంజయ్ యాదవ్, ఉప్పునుంతల అజయ్, పోతుగంటి సునీత దయానంద్, కాంగ్రెస్ నేతలు మహమ్మద్ అజం భాయ్, మొహమ్మద్ ఇర్ఫాన్ తదితర నేతలు పాల్గొన్నారు.

# ప్రపంచ శాంతి, మహిళా హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలి

**నగర నిజం న్యూస్ , జవహర్ నగర్, తేదీ: 9 మార్చి:** ప్రపంచ శాంతి సాధనకు మహిళల హక్కుల పరిరక్షణకు శ్రామిక మహిళలు సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యూ (విముక్తి) రెండు తెలుగు రాష్ట్రాల కన్వీనర్ పెర్క సునీత, జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ పాషామియా పిలుపునిచ్చారు. కాప్రా, జవహర్ నగర్ జిహెచ్ఎంసి పరిధిలోని చెన్నాపూర్, దేవేందర్ నగర్ ప్రాంతాల్లో మార్చి 8న నిర్వహించిన 116వ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సభలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమం యమునా గౌడ్, మహ్మద్ పుతిలీ బీ అధ్యక్షతన జరిగింది. ప్రపంచంలో మహిళలపై జరుగుతున్న వివక్ష, అణచివేత, వర్గ దోపిడీకి వ్యతిరేకంగా శ్రామిక మహిళలు ఐక్యంగా గొంతెత్తే రోజే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవమని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్ షావలి పేర్కొన్నారు. స్త్రీ పురుష సమానత్వం, సమాన పనికి సమాన వేతనం ఇప్పటికీ పూర్తిగా అమలు కాలేదని తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక తుమ్మరాణి తెలిపారు. మధ్య భారతదేశంలో ఆపరేషన్ ఖగార్ పేరుతో ఆదివాసి మహిళల జీవన విధానాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలంగాణ ఉద్యమకారిణి పోత సునీత ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన విధానాలను అనుసరించి ఆదివాసీ ప్రజల హక్కులను పరిరక్షించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. పశ్చిమాసియా దేశాల్లో ఆయిల్ వనరుల కోసం జరుగుతున్న యుద్ధాలను వెంటనే నిలిపివేయాలని




పిఓడబ్ల్యూ (విముక్తి) రాష్ట్ర నాయకురాలు నిర్మల్ కళక్క డిమాండ్ చేశారు. రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ప్రపంచ దేశాలు శాంతి సాధనకు కృషి చేయాలని ముస్లిం కమిటీ కార్యదర్శి టి.కాలేషా విజ్ఞప్తి చేశారు. స్త్రీల అభివృద్ధి విద్య ద్వారానే సాధ్యమని సామాజిక సంస్కర్తలు సావిత్రిబాయి పూలే, షేక్ ఫాతిమా వంటి మహనీయుల ఆదర్శాలను అనుసరించాలని దక్షిణ భారత సమాఖ్య నాయకుడు మహ్మద్ రషీద్ ద్రావిడ సూచించారు. కుల మత ప్రాంతీయ విద్వేషాలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని ఆడజన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు ధనలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మైనారిటీ విభాగానికి చెందిన మతీన్, బహుజన రక్షణ సమితి మహ్మద్ జావేద్, టివిఐకె మబ్బు బాలు, ముస్లిం కమిటీ సభ్యులు సైయద్, అబ్బు, దౌలత్ బీ, యశరత్ బీ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో 3 కోట్ల విలువైన విదేశీ గంజాయి పట్టివేత






- కౌలాలంపూర్ నుండి హైదరాబాద్ వచ్చిన ఇద్దరు ప్రయాణికుల నుండి 8 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ
- నిందితులు చేరుపల్లి దినేష్, లాల్ అబ్దుల్లా సలాం ను అరెస్టు చేసిన డీఆర్ఐ అధికారులు

**రాజేంద్రనగర్, మార్చి 9(నగరనిజం ప్రతినిధి):** శంషాబాద్ విమానాశ్రయంలో మరోసారి భారీగా విదేశీ గంజాయి పట్టుబడడం సంచలనం సృష్టించింది. కౌలాలంపూర్ నుండి హైదరాబాద్ వచ్చిన ఇద్దరు నిందితులు లగేజీ బ్యాగుల మాటున హైడ్రోపోనిక్ గంజాయిని తరలిస్తూ శంషాబాద్ విమానాశ్రయంలో డీఆర్ఐ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. కలకలం రేపిన ఈ ఘటన శంషాబాద్ విమానాశ్రయంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. అధికారుల కథనం ప్రకారం.... కౌలాలంపూర్ ప్రాంతానికి చెందిన చేరుపల్లి దినేష్, పులినిషా లాల్ అబ్దుల్లా సలాం అనే ఇద్దరు నిందితులు ఆదివారం రాత్రి కౌలాలంపూర్ నుండి హైదరాబాద్ చేరుకున్నారు. అయితే విదేశీ గంజాయి అక్రమ రవాణాపై పక్కా సమాచారం అందుకున్న డీఆర్ఐ అధికారులు.... శంషాబాద్ విమానాశ్రయంలో నిఘా పెట్టి నిందితుల ఆట కట్టించారు. ఈ మేరకు నిందితుల లగేజీ బ్యాగులను స్కానింగ్ చేసిన డీఆర్ఐ అధికారులు.... లగేజ్ బ్యాగుల్లో అమర్చుకొని వచ్చిన హైడ్రోపోనిక్ గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులు ఇద్దరి వద్ద నుండి దాదాపు 8 కేజీల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. పట్టుబడిన గంజాయి విలువ మార్కెట్లో దాదాపు మూడు కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. నిందితులు ఇద్దర్ని అరెస్టు చేసిన డీఆర్ఐ అధికారులు..... వారిపై ఎన్.డి.పీ.ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు.

# బాచారం గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహణ





**అబ్దుల్లాపూర్ మెట్, 9, మార్చి (నగర నిజం) :** అబ్దుల్లాపూర్ మెట్ మండలం జిహెచ్ఎంసి పరిధిలోని బాచారం గ్రామంలో శ్రీ జ్ఞానగిరి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన ఈ మహోత్సవాన్ని దర్శించేందుకు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, చుట్టుప్రక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మహిళలు, యువతులు, యువకులు పాల్గొని కళ్యాణోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించారు. అనంతరం ఆలయ చైర్మన్ కళ్ళెం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ...ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందని తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని, భక్తులందరికీ శ్రేయస్సు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.









## 108 అత్యవసర సేవలపై ఆకస్మిక తనిఖీ




**అబ్దుల్లాపూర్ మెట్, 9, మార్చి (నగర నిజం) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జీవీకే ఈఎమ్ఆర్ఐ నిర్వహిస్తున్న 108 అత్యవసర సేవలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా సమర్థంగా పనిచేస్తున్నాయని జిల్లా మేనేజర్ షేక్ జాన్ షాహిద్ తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడే ఈ సేవలు అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందిస్తూ ముందంజలో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని హయత్ నగర్ 108 కేంద్రం పరిధిలోని అబ్దుల్లాపూర్ మెట్ మండలం ఇంజాపూర్ ప్రాంతంలో పనిచేస్తున్న 108 అంబులెన్సు వాహన సేవలను జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్సులో ఉన్న వైద్య పరికరాలు, మందులు, దస్త్రాలను పరిశీలించి సిబ్బందితో సేవల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకోవాలని, బాధితులకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందించి సమీప ఆసుపత్రికి తరలించే విధంగా సేవలు కొనసాగించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన అత్యవసర వైద్య సేవలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఎంతో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఇంజాపూర్ 108,హయత్ నగర్108 అంబులెన్సు సిబ్బంది సత్యం, నరసింహ, కృష్ణ, లక్ష్మీకాంత్ పని తీరు ప్రశంసనీయం అని పేర్కొన్నారు. అలాగే రంగారెడ్డి జిల్లా మేనేజర్ రాజబాబును కూడా అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో అత్యవసర సేవలను సమర్థంగా నిర్వహించడం సంతోషకరమని తెలిపారు.

## ఏపీ, తెలంగాణ వ్యాప్తంగా ఎన్‌బీబీఎల్ భారత్ కనెక్ట్‌లో ఈ చలాన్ చెల్లింపులకు పెరుగుతున్న ఆదరణ

**హైదరాబాద్,9,మార్చి,(నగర నిజం) :** నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కి చెందిన పూర్తి అనుబంధ సంస్థ ఎన్‌పీసీఐ భారత్ బిల్‌పే లిమిటెడ్ (ఎన్‌బీబీఎల్) తమ భారత్ కనెక్ట్ ప్లాట్‌ఫామ్‌లో ప్రవేశపెట్టిన ఈ చలాన్ సేవకు మంచి స్పందన లభిస్తున్నట్లుఎన్‌బీబీఎల్ (ఎన్ బీబీఎల్ ) ప్రతినిధి నూపూర్ చతుర్వేది తెలిపారు. 2025 అక్టోబర్‌లో ప్రారంభమైనప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ ట్రాఫిక్ పోలీస్ విభాగంలో 4.5 లక్షలకు పైగా ఈ చలాన్ లావాదేవీలు నమోదయ్యాయన్నారు. తెలంగాణ ట్రాఫిక్ పోలీస్ పరిధిలో 1.3 లక్షలకు పైగా లావాదేవీలు నమోదయ్యాయని,ఈ సేవకు ఆదరణ మరింత పెరుగుతోందన్నారు. 2026 ఫిబ్రవరి నెలలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా 1,02,096 లావాదేవీలు, తెలంగాణలో 22,882 లావాదేవీలు నమోదయ్యాయన్నారు. భారత్ కనెక్ట్ ద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన జరిమానాలను సులభంగా గుర్తించి డిజిటల్‌గా చెల్లించే సౌకర్యం అందుబాటులోకి రావడంతో ఈ వృద్ధి కనిపిస్తోందని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు హైదరాబాద్‌లో డ్రోన్ ప్రచారం కూడా నిర్వహించారన్నారు. ప్రధాన ట్రాఫిక్ కూడళ్ల వద్ద ఇంటరాక్టివ్ స్క్రీన్‌లను డ్రోన్‌ల ద్వారా ప్రదర్శిస్తూ ఈ చలాన్ సేవపై ప్రచారం చేశారని, భారత్ కనెక్ట్‌లో ఈ చలాన్ కేటగిరీ గురించి ఈ నగరవ్యాప్త ప్రచార కార్యక్రమం మరింతగా అవగాహన పెంచిందన్నారు. వినియోగదారులకు పరిమిత స్థాయిలో డిజిటల్ ఆప్షన్లు ఉండటం వల్ల సాధారణంగా చలాన్ చెల్లింపులు డిజిటల్ రూపంలో ఎక్కువగా అందుబాటులో ఉండేవి కావు. ప్రజలు ఎక్కువగా నగదు ద్వారా లేదా చలాన్ ఇచ్చిన చోట ఉన్న పీ ఓ ఎస్ యంత్రాల ద్వారా, లేదా రాష్ట్రాల వారీగా వేర్వేరు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా చెల్లించేవారని, ఇప్పుడు ఎన్ బీబీఎల్ ఈ చలాన్ విభాగం ద్వారా ఒకే ప్రామాణికమైన, విశ్వసనీయమైన ప్లాట్‌ఫామ్‌లో చలాన్ వివరాలను తెలుసుకుని చెల్లించే అవకాశం పౌరులకు లభిస్తోందన్నారు. ఇది ప్రభుత్వ సేవలను డిజిటలైజ్ చేసే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు. డిజిటల్ చెల్లింపుల సామర్థ్యాలను ప్రభుత్వ సేవల జవాబుదారీతనం, భద్రతతో మేళవించి భారత్ కనెక్ట్ పౌరులకు డిజిటల్, సహాయక ఛానెల్‌ల ద్వారా సౌకర్యవంతమైన చెల్లింపు ఆప్షన్లను అందిస్తోంది."భారత్ కనెక్ట్‌లోని ఈ చలాన్ సేవ కేవలం డిజిటల్ అప్‌గ్రేడ్ మాత్రమే కాదు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవలను సరికొత్తగా నిర్వచించేందుకు వీలవుతుందని తెలియజెప్పేందుకు ఇదొక శక్తివంతమైన ఉదాహరణ అన్నారు. ఈ ప్రయత్నంలో తమకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ ట్రాఫిక్ పోలీస్, తెలంగాణ ట్రాఫిక్ పోలీస్ శాఖలకు సందర్భంగా కృతజ్ఞతలు చెప్పారు.ఎన్ బీబీఎల్ప్రస్తుతం 700కి పైగా భారత్ కనెక్ట్ యాప్‌లు, బ్యాంకులు, ఏజెంట్ల ద్వారా ఈ సేవ అందుబాటులో ఉందని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఈ సేవ ప్రారంభమైంది. ఈ చలాన్ విభాగం పౌరులకు వెసులుబాటును పెంచడమే కాకుండా, దేశవ్యాప్తంగా విస్తరించగల నమూనాగా మారే అవకాశముందని చెప్పారు.

## రాహుల్ బంధు కింద రేవంత్ రెడ్డి రూ.1000 కోట్లు పంపిస్తున్నారు

- కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలో రైతుబంధు పడేదన్న కేటీఆర్
- ఇప్పుడు కోతల సమయం వచ్చినా రైతుబంధు పడలేదన్న కేటీఆర్
- రుణమాఫీ చేశానని అనుకుంటున్నానని రేవంత్ రెడ్డి చెప్పడం

**విడ్డూరమని వ్యాఖ్య**

**హైదరాబాద్, నగరనిజం:**'రాహుల్ బంధు' పథకం కింద ప్రతి సంవత్సరం రూ.1000 కోట్లు ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సిరిసిల్లలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలో రైతుబంధు పడేదని, కానీ ఇప్పుడు కోతల సమయం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం వేయలేదని విమర్శించారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలో రైతుబంధును నిలిపివేసి 'రాహుల్ బంధు' పేరుతో కొత్త పథకం తెచ్చారని ఎద్దేవా చేశారు. తన పదవిని కాపాడుకోవడం కోసం రేవంత్ రాహుల్ బంధు పథకం కింద గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తున్నాడని ఆరోపించారు. అందుకే కేసీఆర్ ముందే చెప్పారని, ఆలోచించి జాగ్రత్తగా ఓటు వేయాలని సూచించారని తెలిపారు. రేవంత్ రెడ్డి మూడుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారని విమర్శించారు."నేను రుణమాఫీ చేశానని అనుకుంటున్నా, రైతుబంధు వేశానని అనుకుంటున్నా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల అన్నారని, అసలు ఆయన ముఖ్యమంత్రేనా అని నిలదీశారు. మరి ముఖ్యమంత్రిగా మీరెందుకు ఉన్నారని ప్రశ్నించారు. రైతుబంధు వేస్తే, రుణమాఫీ ఇస్తే మీకు తెలియకుండా ఉండటమేమిటని అన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- సమస్యలను పరిష్కరించే బాధ్యత అధికారులదే
- 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపైఅధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 9 నగర నిజం :** వికారాబాద్ జిల్లాలో ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు.సోమవారము సమీకృత కార్యాలయాల సమావేశము హాలు నందు నిర్వహించిన ప్రజావాణికి 289 దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణికి ప్రజలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వస్తారని వారికీ సంబంధించిన సమస్యల వివరాలతో ఇచ్చిన దరకాస్తు ను పరిశీలించి సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని అన్నారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీలు, ఆరోగ్య శాఖ ,పంచాయతీ రాజ్,డి పి ఓ , అటవీ శాఖ, డీఆర్‌డీఏ, వ్యవసాయ శాఖ ,ప్రణాళిక శాఖ, గనుల శాఖ, భూసేకరణ వివిధ జిల్లా అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై పెండింగ్ ఫైల్స్ అన్నియు క్లియర్ చేయాలనీ అధికారులకు ఆదేశించారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి పూర్తి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని ఆదేశించారు.అనంతరం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ , జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు,ప్రజా ప్రతినిధులు కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు , వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, రెవెన్యూ అదనపు కలెక్టర్ రాజేశ్వరి, జడ్.పి.సి. ఈ .ఓ ,సుదీర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్ , వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మద్ది జగదీశ్వర్ రెడ్డి కూతురు నిశ్చితార్థ వేడుక

- గాలా రీ ట్రీట్ కన్వెన్షన్ వేదికగా నిశ్చితార్థ సంబురం
- వేడుకకు హాజరైన రాజకీయ, వ్యాపార దిగ్గజాల తో పాటు చిన్ననాటి స్నేహితులు



రాజేంద్రనగర్, మార్చి 9 (నగరనిజం ప్రతినిధి):శంషాబాద్ సమీపంలోని మామిడిపల్లి ప్రాంతానికి చెందిన గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ సికింద్రాబాద్ సర్కిల్ అధికారి మద్ది జగదీశ్వర్ రెడ్డి - అరుణా రెడ్డి దంపతుల కూతురు వివాహ నిశ్చితార్థ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. బొంగులూరు సమీపంలోని గాలా రీ ట్రీట్ వేదికగా మద్ది జగదీశ్వర్ రెడ్డి - అరుణా రెడ్డి దంపతుల కూతురు మద్ది ప్రణీత - సౌమిత్ వివాహ నిశ్చితార్థ వేడుక ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది.ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో పురోహితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య వీరి వివాహ నిశ్చితార్థ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ నేపథ్యంలో వైష్ణోయి గ్రూప్ సంస్థల వ్యాపార వేత్త ఎడ్ల కృష్ణా రెడ్డి, జెల్ పల్లి మాజీ సర్పంచ్ కృష్ణా రెడ్డి, తదితర వ్యాపార వేత్తలు,రాజకీయ ప్రముఖులు మద్ది జగదీశ్వర్ రెడ్డి - అరుణా రెడ్డి దంపతుల కూతురు వివాహ నిశ్చితార్థ వేడుక కు హాజరయ్యారు. కాబోయే వధూవరులను ఆశీర్వదించి జగదీశ్వర్ రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా శంషాబాద్ కు చెందిన మద్ది జగదీశ్వర్ రెడ్డి చిన్ననాటి స్నేహితులు ఎడ్ల కృష్ణారెడ్డి, మద్ది ధర్మారెడ్డి, తోట లవకుశ రెడ్డి, ఎం.అనిల్ కుమార్, ఎం నాగేశ్వరరావు, జెల్లపల్లి శ్రీనివాస్, చాకలి రమేష్, రాజేశ్వర్, మంచర్ల శ్రీనివాస్ (సీనియర్ జర్నలిస్ట్) తదితరులు ప్రణీత - సౌమిత్ వివాహ నిశ్చితార్థ వేడుక కు హాజరై కాబోయే దంపతులను ఆశీర్వదించారు.ఈ మేరకు చిన్ననాటి స్నేహితుడైన మద్ది జగదీశ్వర్ రెడ్డి- అరుణా రెడ్డి దంపతులకు అభినందనలు తెలిపారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE